క్లుప్తంగా

మైనార్టీల మండల కమిటీ ఎన్నిక

కొలిమిగుండ్ల: స్థానిక నూరాన్ మసీదులో ప్రభుత్వ ఖాజీ ఖాదర్‌వలి అధ్యక్షతన శనివారం ముస్లిం మైనార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. వివిధ గ్రామాల నుంచి ముస్లింలు హాజరై కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా బాయికాటి హుసేన్‌పీరా, ఉపాధ్యక్షుడు షేక్ హుసేన్‌వలి, సెక్రటరీగా పాణ్యం సలీం బాషా, జాయింట్ సెక్రటరీగా మాబు సుబాన్‌వలి, ట్రెజరర్‌గా హుసేన్ బాషా, గౌరవ అధ్యక్షుడిగా హాజీవలి, ముఖ్య సలహాదారుగా జాకీర్ హుసేన్‌ను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, కేసుల వివరాలను సీఐ హనుమంతునాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాల నిర్వహణపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్‌ఐ భూపాలుడు ఉన్నారు.

13న పేరుసోములలో ముగ్గుల పోటీలు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మద్దిలేటి తెలిపారు. శ్రీవిద్య పాఠశాల ఆవరణలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు



కృష్ణారెడ్డి (ఫైల్)

డోన్/ డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కృష్ణారెడ్డి (53) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ సూపర్‌వైజర్ జాన్‌మోజెస్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఐవీఆర్ రెడ్డి శనివారం మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియలకు రూ.15 వేలు అందజేశారు. అలాగే రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, జీవీ కృష్ణారెడ్డి సంఘం తరుపున రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కాగా మృతునికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

కోవెలకుంట్ల: వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. శనివారం జమ్మలమడుగు చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర రహదారుల్లో వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో సోమవారం ఆరు పళ్లలోపు ఎద్దులకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన వారికి వరుసగా రూ.35 వేలు, రూ. 25, రూ. 15, రూ. 10, రూ.8, రూ. 5వేల చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అలాగే 15వ తేదీ న్యూ క్యాటగిరి ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వ రుసగా రూ.50, రూ. 35, రూ. 25, రూ. 15, రూ. 10, రూ. 8, రూ.6, రూ. 5వేల చొప్పున బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు 15వ తేదీ ఉదయం 8 గంటలలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బదిలీలను పారదర్శకంగా చేపట్టాలి

కోవెలకుంట్ల: ఈ ఏడాది వేసవిలో చేపట్టే ఉపాధ్యాయ బదిలీల్లో పారదర్శకత పాటించాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్, అధికార ప్రతినిధి వీరబ్రహ్మం కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెర్ఫార్మన్స్ పాయింట్లను పరిగణలోకి తీసుకుంటే బదిలీల్లో పైరవీలకు అవకాశం ఏర్పడే అస్కారం ఉందన్నారు. దీని వల్ల అర్హులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. కేవలం సర్వీస్ పాయింట్లు, స్టేషన్ పాయింట్లను ప్రామాణికంగా తీసుకుని బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు.





గుండం ఆంజనేయస్వామి ఆలయం (ఇన్‌సెట్) ఏకశిలతో తయారు చేసిన ఆంజనేయస్వామి విగ్రహం



చెక్కు చెదరని కోట గోడ

ఈ కోనేరు.. ప్రత్యేకతకు దర్పణం

- అద్దాన్ని తలపించేలా స్వచ్ఛమైన నీరు
- ఎప్పటికీ ఎండిపోని జలం
- శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మాణం
- వర్షాకాలంలో పంట పొలాలకు కొలను నీరు



ఆలయ ఆవరణలో ఉన్న కోనేరు

SUNDAY Special

కొలిమిగుండ్ల: శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలంలో ఇంజినీరింగ్ నైపుణ్యంతో నిర్మించిన ఎన్నో నిర్మాణాలు వందల ఏళ్లు అయినా నేటికి చెక్కు చెదరకుండా దర్శనమిస్తున్నాయి. అలాంటి కోవకు చెందినదే హనుమంతుగుండం సమీపంలో నిర్మించిన కోనేరు. రాయల పరిపాలన కాలంలో ఇక్కడ రాముడు, శివుడు, గుండం ఆంజనేయస్వామి విగ్రహాలను ఒకే ఆలయ సమూహంలో నిర్మించారు. వీటికి చెంతనే అద్దంలా మెరిసిపోయేలా కోనేటిని అద్భుత రీతిలో నిర్మించారు. ఈ కోనేటిలోకి వందల ఏళ్లు గడిచినా ఎక్కడి నుంచి నీళ్లు వచ్చి చేరుతాయో అంతు చిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది. 25 నుంచి 30 అడుగుల లోతున్న కోనేటి నీరు చాలా తేటగా ఉంటాయి. ఎలాంటి వస్తువు వేసినా కనిపిస్తుంది. అప్పట్లో కట్టిన రాతి నిర్మాణం నేటికి చెక్కుచెదరకుండా ఉంది. కోనేటికి ఓవైపు ద్వారం నిర్మించారు. నీళ్లు అధికమైతే బయటకు పోయేలా చేశారు. దశాబ్దాలు గడుస్తున్నా ఏ ఒక్క రోజు కోనేరు పూర్తిగా ఎండిపోయిన దాఖలాలు లేవని గ్రామ పెద్దలు చెబుతున్నారు. కోనేటిలోని నీటితోనే సమీపంలోని రైతులు పలు రకాల పంటలు పండిస్తుంటారు. నీటి ఎద్దడి సమయంలోనూ రైతులు కోనేటి లోనుంచి ఇంజిన్‌ల సాయంతో పంటలకు నీరు కట్టుకున్న సందర్భాలు ఉన్నాయి.

చెంతనే కోట నిర్మాణం

రాయలకు చెందిన సామంతరాజులు ఆలయానికి కూత వేటు దూరంలోనే కోటను నిర్మించుకున్నారు. నేటికీ కోట గోడలు అప్పటిలాగే కొత్తగా కనిపిస్తున్నాయి. పక్కనే పెద్ద తటాకం నిర్మించారు. గుర్రాలు, ఏనుగులు తదితర వాటి అవసరాల కోసం నిర్మించినట్లు చరిత్ర ఆధారాల ద్వారా తెలుస్తుంది. చెరువు నిర్మాణం చేయడం వల్ల ఇప్పటి తరాల వారు పంటల సాగుకు నీటిని ఉపయోగిస్తున్నారు. ఆలయంలో ఏకశిలతో నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహం చాలా మహిమ గలవాడని భక్తుల నమ్మకం. ఐదున్నర అడుగుల ఎత్తులో విగ్రహం ఉంటుంది. ఏకశిలతో చేసిన విగ్రహాలు చాలా అరుదుగా ఉంటాయి. ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణం పూర్తి కాగానే ఇక్కడి నుంచే కూలీలు, సామగ్రిని తీసుకెళ్లి కొలిమిగుండ్ల కొండపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర ఆధారాలను బట్టి తెలుస్తుంది. ఆంజనేయ స్వామి ఆలయం చెంతనే హనుమంతు గుండం గ్రామం ఉండేది. 1994 వరకు ఫ్యాక్షన్‌తో అట్టుడికిపోయింది. ఆ తర్వాత ప్రశాంత వాతావరణం నెలకొనడంతో ఊరంతా ప్రధాన రహదారిలో కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నారు.

ఆహ్లాదకర వాతావరణం



మహారాజు కాలంలో నిర్మించిన ఈ ఆలయ పరిసరాలన్నీ ఆహ్లాదకర వాతావరణంలో ఉన్నాయి. ముఖ్యంగా కోనేరు చాలా అద్భుత పనితీరుతో నిర్మించారు. నీరు ఎక్కడి నుంచో ఊటలాగా ఇక్కడికి వచ్చి చేరుతుంటాయి. సమీప రైతులు ఈ నీటినే వాడుకుంటుంటారు. నీరు చాలా రుచిగా ఉంటాయి.

–సుధానందస్వామి

గరుడ వాహనంపై నరసింహుని వైభవం



గరుడ వాహనంపై మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని మద్దిలేటి నరసింహస్వామిని శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, మేళతాళాలు, గోవిందనామస్మరణ నడుమ ఊరేగింపు కనుల పండువగా సాగింది. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు కల్యాణ చక్రవర్తి, జ్వాలా చక్రవర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో కుడారై ఉత్సవం



కుడారై ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

డోన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కుడారై ఉత్సవాన్ని అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ద్వాదశి రోజున స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపహరణం జరుగుతుందని వారు తెలిపారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి పట్టణ వీధుల్లో విహరించారు. ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీకుమారి, శ్రీనివాసరావ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కోవెలకుంట్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక పాండురంగ స్వామి దేవాలయ ఆవరణలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన 100 మహిళలు పండుగ సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. పట్టణానికి చెందిన మధుహర్షిణి ప్రథమ బహుమతిగా వాషింగ్ మిషన్, మహాలక్ష్మి ద్వితీయ స్థానంలో కుట్టుమిషన్, సుకన్య మూడో స్థానంలో కూలర్, రాజ్యలక్ష్మి నాల్గో స్థానంలో టవర్‌ఫ్యాన్, సుగుణ ఐదో స్థానంలో నిలిచి కిచెన్ సామగ్రి సెట్టును కైవసం చేసుకున్నారు. మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ బహుమతులను ప్రదానం చేశారు.

బహుమతుల ప్రదానం

బేతంచెర్ల: స్థానిక అమ్మవారిశాల ఆవరణలో వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా వరలక్ష్మి, విజయలక్ష్మి, రాజేశ్వరి వ్యవహరించారు. విజేతలకు డబుల్‌కాట్ మంచంచ సోఫా, డ్రెస్సింగ్ టేబుల్ తదితర బహుమతులు అందజేశారు. సంఘం నాయకులు ధనుంజయ, రాజేంద్ర, సుధీర్, రమణ, ఇందుమతి, నాగమణి పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

బనగానపల్లె రూరల్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) నూతన డైరీ, క్యాలెండర్లను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శనివారం ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్, సభ్యులు వెంకటేశ్వర్లు, సత్యప్రకాష్, కృష్ణయ్య, నాగరాజు, సుధాకర్ ,సన్నన్న, విజయకుమార్, దస్తగిరి, మనోహర్ శీనయ్య పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం కష్టపడే వారికి సముచిత స్థానం దక్కుతుందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ బేతంచెర్ల మండల అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన తిరుమలేశ్వర్‌రెడ్డిని అభినందించారు. ఆయన వెంట ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ముర్తుజావలీ, మురళీకృష్ణ, బుగ్గన చంద్రారెడ్డి, గూని నాగరాజు, నాగేశ్వరరావు, ఇబ్రహీం, ఎద్దులన్న ఉన్నారు.



తిరుమలేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్న అర్జున్‌రెడ్డి, పార్టీ నాయకులు

భక్తిశ్రద్ధలతో రామ్‌లల్లా వార్షికోత్సవం

డోన్ టౌన్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట చేసి ఏడాది కావడంతో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో డోన్ బ్రాంచ్ మేనేజర్ రాముడు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డోన్ వేద బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శంకరయ్యశర్మ అయోధ్య రాముడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరాముని ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.



బాలరామునికి పూజలు చేస్తున్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

మినీ గోకులం షెడ్లు ప్రారంభం

బనగానపల్లె రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్డును మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. పాడి రైతులకు గోకులం షెడ్డు నిర్మాణ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎన్‌ఆర్‌జీఎస్ పీడీ జనార్ధన్‌రావు, ఏపీడీ నరసింహారెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో శనివారం మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద వల్లంపాడులో మూడు, కోవెలకుంట్ల, భీమునిపాడు,కంపమల్ల, వెలగటూరు, చిన్నకొప్పెర్ల, పెద్దకొప్పెర్ల, కలుగొట్ల, రేవనూరు గ్రామాల్లో ఒక్కోటి చొప్పున పశువుల షెడ్లను ఎంపీడీఓ వరప్రసాదరావు ప్రారంభించారు. కోవెలకుంట్ల, బిజనవేముల, కలుగొట్ల పశువైద్యాధికారులు కృష్ణకుమార్, విజయలక్ష్మి, ఉపాధి పథక ఏపీఓ శ్రీవిద్య పాల్గొన్నారు.



తిమ్మాపురంలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి బీసీ

సద్వినియోగం చేసుకోవాలి

ప్యాపిలి: గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని పోదొడ్డి, వెంగలాంపల్లి, నల్లమేకలపల్లి, మెట్టుపల్లి, చిన్నపొదిల్ల గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించుకున్న గోకులం షెడ్లను ఎంపీడీఓ ప్రారంభించారు. మండలానికి 23 గోకులం షెడ్లు మంజూరైనట్లు తెలిపారు.సర్పంచ్ రంగస్వామి, పశువైద్యాధికారి విద్యాసాగర్, ఏపీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

కాటసానికి కృతజ్ఞతలు

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ కొలిమిగుండ్ల మండల అధ్యక్షుడిగా నియమితుడైన అంబటి గురివిరెడ్డి, ఆ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పేరం కిశోర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని శనివారం ఆయన నివాసంలో వేర్వేరుగా కలిశారు. తమ నియామకంపై కాటసానికి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. అంబటి చంద్రమోహన్‌రెడ్డి, నీలం సంజీవ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నియామకంపై హర్షం





సోమేష్ యాదవ్,మల్లికార్జునరెడ్డి

డోన్: వైఎస్సార్‌సీపీ డోన్ మండల అధ్యక్షునిగా తాపల కొత్తూరు సోమేష్ యాదవ్, పట్టణ కార్యదర్శిగా మల్లికార్జునరెడ్డి నియామకంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజేష్ వారికి అభినందనలు తెలిపారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు గాయాలు

డోన్ టౌన్: గుర్తు తెలియని కారు ఢీకొనడంతో మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్‌కు గాయాలైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 6వ తేదీ పట్టణంలోని గుత్తి రోడ్డులో పెట్రోల్ బంక్ నుంచి స్కూటీపై వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొని గాయపడ్డారు. ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యాయత్నం అంటూ శనివారం ప్రచారం జరగడంతో హరికిషన్ స్పందించారు. అలాంటిది ఏమీలేదని.. స్వల్పగాయాలే అయినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: మండలంలోని చిన్న మల్కాపురంలో 33కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం చిన్న మల్కాపురం, ఆర్‌ఎస్.రంగాపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంట్ తెల్లవారుజామున 5 గంటల నుంచి 10 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

బేతంచెర్ల: రంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని రంగాపురం, గూటుపల్లె గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. త్రీఫేస్ కరెంట్ తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 10 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న మ్యాక్స్ పోర్ హోటల్ వద్ద బైక్‌ను ట్రాక్టరు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉదయ్ కిరణ్, సుదర్శన్ అనే యువకులు బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డోన్ ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు.

పోరాట యోధుడు వడ్డే ఓబన్న



డోన్: ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డెర్లు



బేతంచెర్లలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎస్‌ఐ

డోన్ టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వడ్డెర సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రూరల్ సీఐ రాకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర సమరంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన అనుచరుడిగా బ్రిటీష్ పాలకులపై తిరగబడిన గొప్ప యోధుడు ఓబన్న అని కొనియాడారు. డోన్ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజు, నాయకులు అన్నయ్య, రంగస్వామి, ఎల్లస్వామి, మద్దిలేటి పాల్గొన్నారు.

–కోవెలకుంట్ల: స్థానిక గ్రంథాలయంలో వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణ స్వామి, న్యాయవాది మౌనిక, ఉపాధి హామీ మేటీ రాములమ్మ, పుల్లయ్య పాల్గొన్నారు.

–బేతంచెర్ల/సంజామల: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, ఎస్‌ఐ రమేష్ బాబు అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే సంజామల మండలం రామాపురంలో గ్రామంలో జయంతి వేడుకలు జరిగాయి.

రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు

- వాహనాల రాకపోకలకు అంతరాయం

బేతంచెర్ల: పట్టణంలోని బనగానపల్లె రైల్వేగేట్ వద్ద ట్రాక్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల వరకు బనగానపల్లె, కోవెలకుంట్ల, కర్నూలు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రత్యామ్నాయంగా బనగానపల్లె రైల్వే గేటు వద్ద నుంచి సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీలోని రైల్వే సింగిల్ బ్రిడ్జి కింద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మీదుగా నంద్యాల క్రాస్ రోడ్డు వరకు వాహనాలను మళ్లించారు. రైల్వే బ్రిడ్జి చిన్నది కావడంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్‌ఐ రమేష్ బాబు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



బనగానపల్లె రైల్వే గేటు వద్ద జరుగుతున్న పనులు

